
ఎమ్మెల్యే కూనంనేనికి వినతిపత్రం ఇస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నేతలు

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీపై అసెంబ్లీలో చర్చించండి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

రాంనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజు దోపిడీ, ప్రభుత్వ ఆస్పత్రులలో సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు పీవైఎల్, పీవోడబ్ల్యూ నేతలు కె.ఎస్.ప్రదీప్, ఎం.లవకుమార్, పీవోడబ్ల్యూ నేతలు వరలక్ష్మి, బి.ఎస్.కృష్ణ, పుష్ప, సాయి, రమేష్ వినతిపత్రం మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల్లో సర్వేలు నిర్వహించా మని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. పారామెడికల్ టెక్నీషియన్ కొరతతో అన్ని టెస్టులు చేయడం లేదన్నారు. మందుల కొరత తీవ్రంగా ఉన్నాయన్నారు. ఫలితంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీపై అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యే కూనంనేనిని కోరారు.


వీహెచ్ నివాసంలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

సమగ్ర కుటుంబ సర్వే మంచి పరిణామం: వీహెచ్

నల్లకుంట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్యా్యాసం కోసం బీసీ కులగణన సర్వే ఎంతో ముఖ్యమైనదని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనాభా గణన సర్వే మంగళవారం బాగ్‌అంబర్‌పేటలోని వీహెచ్ నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎన్యూమరేటర్లు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే ఎక్స్‌రే వంటిదన్నారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్టు ప్రభుత్వం ఈ సర్వే చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, టీపీసీసీ ఓబీసీ సెల్ కో-ఆర్డినేటర్ కట్టెల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజా సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న పి.సాయిబాబా

రాంనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించి నగరాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ నగర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డుల జారీని వెంటనే చేపట్టి అర్హులైన వారందరికీ కార్డులు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ సమావేశంలో నగరాభివృద్ధి గురించి గానీ, ప్రజల సంక్షేమం గురించి గానీ చర్చించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


షర్మిల జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేస్తున్న ఆకుల ప్రవీణ్

ఘనంగా వైఎస్ షర్మిల జన్మదినం

కవాడిగూడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు కవాడిగూడ డివిజన్ కొత్త బజార్ మెయిన్‌రోడ్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పేదలకుపంపిణీ చేశారు. వైఎస్ షర్మిలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల ప్రవీణ్ మాట్లాడుతూ ఏపీలో షర్మిల సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడంలో కృషి చేస్తున్నారు. తెలంగాణ మాదిరిగానే ఏపీలో కాంగ్రెస్ పార్టీ తనకుమా ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు పి.వర్ధన్‌రాజ్, నగర నాయకులు సూర్యచంద్రశేఖర్, బీరం కిట్టు, సి.శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, బాబురావు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి'

గోల్నాక, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా గోల్నాక డివిజన్ బాగ్‌అంబర్‌పేట పోలింగ్‌బూత్ అధ్యక్షుడిగా ఎఐకుమార్‌తో పాటు కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా బూత్ కమిటీ అధ్యక్షుడిని, సభ్యులను డివిజన్ పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌ఛార్జ్ వెల్లెల అజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్‌లు పార్టీ కండువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎ.శంకర్, జీవలక్ష్మి, ఎస్.శ్రీధర్‌గౌడ్, అరుణ్‌కుమార్, ఎం.చంద్రశేఖర్‌గౌడ్, ఎం.నృపప్రియ, సంజీవ్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో మేఘనకు సిల్వర్ మెడల్


సిల్వర్ మెడల్ సాధించిన మేఘన

కవాడిగూడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కవాడిగూడ డివిజన్ దోమలగూడకు చెందిన వీరమల్ల మేఘన సిల్వర్ మెడల్ సాధించింది. ఈనెల 15 నుంచి నిర్వహించిన ఈ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్రం నుంచి పాల్గొన్న మేఘన 11 ఏళ్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఆరవ తరగతి చదువుతున్న మేఘన గత సంవత్సరం జరిగిన పోటీలలో ఐదు గోల్డ్ మెడల్స్ సాధించి రికార్డు నెలకొల్పింది. సిల్వర్ మెడల్ సాధించిన మేఘనను హెచ్‌కోచ్ షఫీ, ట్రైనర్ ఆదిల్ అభినందించారు.


సెపక్‌తక్రా నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు

సెపక్‌తక్రా ఫెడరేషన్ జాతీయ కార్యవర్గం ఎన్నిక

గోల్నాక, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి సెపక్‌తక్రా క్రీడను మరింత విస్తృతం చేస్తామని సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శిగా పెరిక సురేష్ ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన జనరల్‌బాడీ మీటింగ్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడిగా యోగేంద్రసింగ్ దహియా ఎన్నికయ్యారు. సురేష్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కార్యక్రమంలో గోవా మాజీ డిప్యూటీ సీఎం చంద్రకాంత్ కవ్లేకర్, వైస్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఆర్. ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మాట్లాడుతూ గ్రామీణస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి సెపక్‌తక్రా క్రీడను తీసుకెళ్లి యువతను ప్రోత్సహిస్తామన్నారు.

అధునాతన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు మోక్షం కలిగేనా?

చిక్కడపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ ప్రాంతంలో అధునాతన మున్సిపల్ కాంప్లెక్స్ పనులకు నేటికీ మోక్షం కలగడం లేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మేయర్ బొంతు రామ్మోహన్‌లు 9 అంతస్తుల్లో మున్సిపల్ కాంప్లెక్స్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడింది. కానీ చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ స్థానంలో కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదన అమలు కాలేదు. ఎన్నికల ముందు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సైతం తొలగించారు. దీంతో అధునాతన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం అటకెక్కిందనే విమర్శలు వస్తున్నాయి. పదిహేను రోజుల క్రితం మున్సిపల్ సిబ్బంది గ్రౌండ్ ఫ్లోర్ షాప్‌ల సంబంధించిన బిల్డింగ్‌ల సైజ్ కొలతలు తీసుకెళ్లినట్లు సమాచారం. మున్సిపల్ సిబ్బంది షాపులవారిని అండజేసి వెళ్లారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో షాప్ 21x12 ఫీట్ల విస్తీర్ణంతో ఉన్నాయి. అయితే మున్సిపల్ షాప్‌లో 9x12 ఫీట్ల విస్తీర్ణంతో రూపొందించడంతో పలువురు దీనికి నిరాకరిస్తున్నారు. తొమ్మిది అంతస్తులతో అధునాతన భవన నిర్మాణం అని చెప్పి కేవలం గ్రౌండ్ ఫ్లోర్ ప్లాన్ ఇవ్వడంతో విమర్శలు వస్తున్నాయి. ఈ కాంప్లెక్స్‌లో దాదాపు 75 షాప్‌ లున్నాయి. వీటిలో సగం షాప్‌లు ఖాళీగానే ఉన్నాయి. ఈ కాంప్లెక్స్‌లో జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీస్, మీసేవ కూడా ఉన్నాయి. అధునాతన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణంలో నీలినీడలు అలముకున్నాయి.


చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్

కొత్త ప్రభుత్వంలో కాంప్లెక్స్ ప్రతిపాదన లేదు



2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధునాతన కాంప్లెక్స్ నిర్మాణం అంటూ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం ఏర్పడినా ఐదేళ్లు పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయింది. ఇప్పుడు కూడా మున్సిపల్ భవనం గురించి ప్రతిపాదన లేదు. షాపుల యజమానులు అంగీకరిస్తేనే భవన నిర్మాణానికి మేము కూడా ముందుకు వస్తాం.

- ఎ.పావనివినయ్‌కుమార్, కార్పొరేటర్

మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించాలి



తక్షణమే మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు ప్రారంభించాలి. 2022లో ఆర్‌టీఐ ద్వారా వివరాలు సేకరించాం. టెక్నికల్ అనుమతుల కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని 40 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేర్కొన్నారు. కానీ ఇంతవరకూ పనులు ప్రారంభమే కాలేదు. ప్రస్తుత మార్కెట్ను పడగొట్టాలి. పనులు మొదలయ్యేది ఎప్పుడో.. కాంప్లెక్స్ నిర్మాణం ఎప్పుడో ఎవ్వరూ అధికారులే చెప్పాల్సి ఉంది.

- టి.శైలజాగోపాల్, మాజీ కార్పొరేటర్

మా డిమాండ్లు ముందు పెడతాం



పదిహేను రోజులకిందట మున్సిపల్ సర్కిల్ 15 సెక్షన్ అధికారి, సిబ్బంది వచ్చి గ్రౌండ్‌ఫ్లోర్ లేఅవుట్‌ప్లాన్ ఇచ్చి వెళ్లారు. మా షాపులన్నీ 21x12 ఫీట్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్లాన్‌లో 9x12 ఉన్నాయి. ఇది మాకు సమ్మతం కాదు. తొమ్మిది అంతస్తుల నిర్మాణం అని చెప్పి గ్రౌండ్‌ఫ్లోర్ ప్లాన్ గీసి ఇచ్చారు. మాకు షాపులు ఎలా అలాట్ చేస్తారు. తాత్కాలికంగా షాప్‌లు ఎక్కడ కేటాయిస్తారు.

- అశోక్‌కుమార్, మున్సిపల్ మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి


మంటల్లో కాలిపోతున్న పంచర్ షాపు

షార్ట్ సర్క్యూట్‌తో పంక్చర్ దుకాణం దగ్ధం

అంబర్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్ గ్రీన్ ల్యాండ్ హోటల్ సమీపంలో పంక్చర్ దుకాణంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణం మొత్తం కాలిపోయింది. ఈ సంఘటనలో షాపులోని ట్యూబ్స్, టైర్లు, సైకిళ్లు మొత్తం కాలిపోయాయి. అంబర్‌పేట పటేల్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహమ్మద్ సందాని గ్రీన్‌ల్యాండ్ హోటల్ సమీపంలో ట్యూబ్లు, టైర్ల పంక్చర్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన ప్రైవేటుగా పెట్రోల్, డీజిల్ కూడా అమ్ముతున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో షాపులో షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. షాపులో పెట్రోల్, డీజిల్ ఉండడంతో మంటలు అంటుకుని వస్తువులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆపేశారు. అప్పటికే షాప్ దగ్ధమైంది. అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, తహసీల్దార్ వీరబాబు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

గ్రంథాలయ పెన్షనర్లకు 010 పద్దుకింద వేతనాలు ఇవ్వాలి

తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న కొక్కుల దేవేందర్ తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పెన్షనర్లకు 010 పద్దుకింద ట్రెజరీ నుంచి వేతనాలు ఇవ్వాలని తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రెజరీ నుంచి పెన్షనర్లు, ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడబోదని ఆయన స్పష్టం చేశారు. సంఘం రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం మంగళవారం త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా 33 జిల్లాలకు చెందిన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మూడేళ్లకొకసారి కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఒక్కటే నామినేషన్ రావడంతో కొక్కుల దేవేందర్ ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తుమ్మ సత్యనారాయణ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోమశివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, సహ కార్యదర్శులు ఆదమ్ షఫి, జగదీశ్వర్‌రెడ్డి, వేదశ్రీ, నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు, వినాగేశ్వరరావు, కార్యవర్గసభ్యులు ఆర్ ఓటులింగ్‌రెడ్డి, జి.రాంరెడ్డి, కె.యాదయ్య, సుదర్శన్‌రెడ్డి, సలహాదారులు తుమ్మ సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు కె.వీరయ్య, నగర ప్రధానకార్యదర్శి బొల్లం మహేందర్ పాల్గొన్నారు.


భోలక్‌పూర్ యూపీహెచ్‌సీలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసిన వైద్యాధికారి మనోజ్‌రెడ్డి

భోలక్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలు

ముషీరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుప్రభువులో దయ గుణాలు ఉండి ప్రజలకు సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వీహెచ్ఎన్ కళావతి, ఏఎన్ఎంలు సంతోషిణి, శ్రీకాంత్, అనసూయ, శీలారాణి, అనూషా, రతన, రేణుక, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అసెంబ్లీ ముట్టడికి పీడీఎస్‌యూ యత్నం

రాంనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యార్థుల మృతికి కారణమవుతున్న పలు కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నేతలు రామకృష్ణ, ఆజాద్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి మంగళవారం చేపట్టారు. అసెంబ్లీ మెట్రోస్టేషన్ నుంచి అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. వారిలో కొంత మందిని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్, మరికొంత మందిని షాహినాత్‌గంజ్ పీఎస్‌కు తరలించి సాయంత్రం విడిచిపెట్టారు. ఆజాద్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింహారావు, అనిల్, నరేందర్, బాష్యత్, పృథ్వీ, సాయి, సురేష్, వెంకటేష్, రాకేష్, సీతారామ్, అనిల్ పాల్గొన్నారు.

'మహంకాళి ఆలయ మరమ్మతులకు భక్తులు సహకరించాలి'

ముషీరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ పైకప్పు పెచ్చులూడి కింద పడిపోతుండడంతో దేవాదాయ శాఖ స్పందించింది. మంగళవారం ఆలయ వద్ద ఆలయ పైకప్పు మరమ్మతు పనులకు భక్తులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తూ ఫ్లెక్సీ బోర్డు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఈవో మహేందర్‌కుమార్ మాట్లాడుతూ.. 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం పై కప్పు శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులు ఊడుతున్నాయని పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న నారాయణ

రాంనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జలమండలిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల కేటగిరిని మార్చి వారి వేతనాలను పెంచాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని జలమండలి వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు, కనీస వేతనాల సలహా మండలి బోర్డు మాజీ చైర్మన్ నారాయణ ప్రభుత్వాన్ని, జలమండలి అధికారులను హెచ్చరించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గసమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వాటర్ వర్క్స్‌లో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో హైదరాబాద్‌లో బతకడం కష్టంగా మారిందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే బోర్డు కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశానికి గౌరవ అతిథిగా హాజరైన బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ మాట్లాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, ఆంజనేయులు, రమేష్, ప్రవీణ్, వీరస్వామి, బాల్‌రాజ్, సురేష్, యాదగిరి, విజయ్, రమాదేవి, తార, బాబు, అశోక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

'ధన్వంతరి' విచారణకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలి


ర్యాలీగా వెళ్తున్న ధన్వంతరి ఫౌండేషన్ బాధితులు

బర్కత్‌పుర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి ఫౌండేషన్ అక్రమాల విచారణకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని ధన్వంతరి బాధితుల పోరాట కమిటీ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ డిమాండ్ చేశారు. పేదలకు పేరుతో వెయ్యి కోట్లు మోసగించిన ధన్వంతరి ఫౌండేషన్ ఎండీ కమలాకర్‌శర్మను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ధన్వంతరి ఫౌండేషన్ బాధితులు కాచిగూడ నుంచి సీపీఐ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్‌శర్మ మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో జరిగిన అగ్రిగోల్డ్ కుంభకోణం కంటే ధన్వంతరి కుంభకోణం చాలా పెద్దది, వేలాది మంది బాధితులు ఉన్నారని తెలిపారు. ధన్వంతరి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీనియర్ కేసు బోరెస్టా వద్ద గల ధన్వంతరి ఫౌండేషన్ కార్యాలయాన్ని వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

బర్కత్‌పుర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రైలు ప్రమాదాల్లో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి-బుద్వేల్ రైల్వేస్టేషన్ల నడుమ 45 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. మరో సంఘటనలో ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల నడుమ 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. మరో సంఘటనలో బుద్వేల్- ఉందానగర్ రైల్వేస్టేషన్ల నడుమ 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ మూడు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మణాచారి తెలిపారు.

'లయన్స్‌క్లబ్ సేవలు అందరూ వినియోగించుకోవాలి'

చిక్కడపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు వినియోగించుకోవాలని లయన్స్ ఇంటర్నేషనల్ బోర్డ్ మెంబర్ డేనియల్ ఎల్విస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి వివేకానగర్ అంజనేయస్వామి ఆలయంవద్ద అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డేనియల్ ఎల్విస్ మాట్లాడుతూ గడిచిన కాలంగా ప్రతీ శనివారం అల్పాహారం పంపిణీ చేయడం పట్ల అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ అందరివాడు

ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి


అంబేడ్కర్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి, మాజీమంత్రి డాక్టర్ గీతారెడ్డి, విమలక్క తదితరులు

రాంనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందరివాడని, అయితే కొంత మంది దళిత నాయకుడు అంటూ ప్రచారం చేయడం సరైంది కాదని చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికీపోడియల్ బయోగ్రఫీ అంబేడ్కర్ పుస్తక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అణచివేత ఉన్నచోట అంబేడ్కర్ భావజాలం ఉంటుందన్నారు. ఎంతో మంది దు చూపుతోనే రాజ్యాంగాన్ని రచించారన్నారు. అరుణోదయ సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ సి.హెచ్.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీమంత్రి జె.గీతారెడ్డి, ఎస్‌టీ ఇంజనీరింగ్ అకాడమి చైర్మన్ వై.వి.గోపాలకృష్ణమూర్తి, ఆర్‌పీఐ అధ్యక్షుడు బి.సుబ్బారావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తా


ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని అరవింద్‌కుమార్‌యాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బాగ్‌లింగంపల్లి ప్రజలు

రాంనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చే విధంగా రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఇళ్లు మంజూరయ్యే విధంగా తనవంతు కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. రాంనగర్ డివిజన్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల లోకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లికి చెందిన పలుబస్తీల పేద మహిళలు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చూడాలని అరవింద్‌కుమార్‌యాదవ్‌ను కలిసి విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్లు కూడా త్వరలో నగరంలో ప్రారంభమవుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇల్లు ఇవ్వని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తస్లీమాబేగం, తబసీంబేగం, సాబానాబేగం, రేఖ, సాహేమాబేగం, అజర్, శ్రీరాజ్, మాజర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అంబర్‌పేట ఉపాధ్యక్షుడిగా షేక్ సర్వరాజ్


షేక్ సర్వరాజ్

అంబర్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా షేక్ సర్వరాజ్ ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పోటీ చేసిన షేక్ సర్వరాజ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా తనకు ఓటు వేసిన వారికి యూత్ కాంగ్రెస్ నాయకులకు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షేక్ జమీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించాలి

పలువురు వక్తల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ బి.చంద్రకుమార్

రాంనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఎస్సీ వర్గీకరణ-సుప్రీంకోర్టు తీర్పు అమలు' అంశంపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు బి.ఆజాద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, ఓయూ ప్రొఫెసర్ కాశీం, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, రైతు స్వరాజ వేదిక నేత కనగంటి రవిలు హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పాలకపార్టీలు రెండు ప్రధానపార్టీల సమాహాల మధ్య వైరుధ్యాన్ని పెంచి పోషించే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అంటే మాదిగ, మాల సామాజిక వర్గాల సమస్యగా చూస్తున్నారని కానీ ఇది మిగిలిన 57 ఉప కులాల సమస్య అనే విషయాన్ని మరుస్తున్నారని అన్నారు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంట్‌లో చట్టం చేసి అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ జనాభా దామాషా ప్రకారం ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు అనురాధ, అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి గొని బాలు, విజయ్, పీడీఎస్‌యూ నాయకులు పి.నాగరాజు, పి.మహేష్, విజయ్, నవీన్, శ్యామ్, సందీప్, శివ, యూస్ఫ్ ఆసిఫ్, సుష్మిత్, రవి తదితరులు పాల్గొన్నారు.